క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కాపు కార్పొరేషన్ డైరెక్టర్


అనుబాబును శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అనుబాబు సోమవారం స్థానిక రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ రాజమండ్రి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్న అనుబాబు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శాలువాతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకుడు లింగం రవి, ముత్యాల బోసికుమార్ పాల్గొన్నారు.

బుద్ధావతారంలో సీతారామస్వామి


బుద్ధావతారంలో దర్శనమిచ్చిన మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

నైపుణ్యంతోనే ఉద్యోగాలు

కాకినాడ రూరల్: నిరుద్యోగులు సాఫ్ట్‌వేర్, ఇతర సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు నైపుణ్యం పెంపొందించుకోవాలని సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తిరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో ఏపీఎస్పీ వద్ద వీజేఎస్‌ఎంఆర్ ఒడిగోస్ కార్యాలయంలో సీఈఓ వారా వినోద్ అధ్యక్షతన సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా మూర్తిరాజు పాల్గొన్నారు. ఒడిగోస్‌లో తర్ఫీదు తీసుకుని ఉద్యోగం పొందిన మార్టిన్‌కు సర్టిఫికెట్‌ను అందించారు.

కారణజన్ముడు ఘంటసాల


ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఇతర ప్రముఖులు

బోట్‌క్లబ్: తన గానంతో అందరినీ ఓలలాడించిన ఘంటసాల కారణజన్ముడని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. సోమవారం ఘంటసాల వేంకటేశ్వరరావు 101 జయంతి సందర్భంగా ఘంటసాల సంగీత కళాపీఠం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయ సమీపంలోని ఘంటసాల విగ్రహానికి నివాళులర్పించారు. చలన చిత్ర పరిశ్రమకు ఘంటసాల చేసిన సేవలు మరువలేమన్నారు. సంస్థ అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబులు మాట్లాడుతూ ఘంటసాల జీవిత విశేషాలను వివరించారు.

సమస్యల పరిష్కారానికే స్పందన
కమిషనర్ నాగనరసింహారావు


స్పందనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. సోమవారం జరిగిన డయల్ యువర్ కమిషనర్‌కు టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్య, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి 8 మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. అలాగే స్పందన ద్వారా మరికొందరు తమ సమస్యలను విన్నవించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క వినతిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.


కరప సమీపంలోని లేఅవుట్‌లో బరకాలతో కప్పిన ధాన్యం రాశులు


వలసపాకలలో నేలనంటిన వరి పొలం


వేములవాడలో మెషీన్‌తో కోయించిన వరిగడ్డి నీటిలో నానుతున్న దృశ్యం

అప్రమత్తం

- మిచాంగ్‌పై జాగ్రత్తగా ఉండండి
- పునరావాస కేంద్రాల ఏర్పాటు
- అవసరమైతేనే బయటకు రండి
- అత్యవసర సేవల కోసం టోల్ ఫ్రీ
- ప్రజలకు కమిషనర్ సూచన

కాకినాడ: మిచాంగ్ తుపానుప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కాకినాడ నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేసింది. తుపానుతీవ్రత అధికంగా ఉండే ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసింది. తుపానుప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారులు, విద్యుత్, ఫిషరీస్, అగ్నిమాపక, రెవెన్యూ శాఖాధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. 90–100 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున, హోర్డింగ్‌లు, చెట్లు పడిపోవడం, విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాలకు నష్టం జరగడం వంటి సంఘటనలు ఎదురైతే, తీసుకోవలసిన చర్యలపై ఆయా శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు.

పునరావాస కేంద్రాలకు తరలించాలి

ముఖ్యంగా పూరిళ్లు, రేకుల షెడ్లు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివసించే ప్రజలను ముందుజాగ్రత్తగా పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్ల వంటి పునరావాస కేంద్రాలకు తరలించడం, వారికి అవసరమైన వసతి, భోజన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలిచ్చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా కార్పొరేషన్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అవసరమైతే టోల్‌ఫ్రీ నంబర్ 1800 4255 990కు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్, ఈఈలు మాధవి, వెంకటరావు, డీఈలు, ఏఈలు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ పర్యటన

మిచాన్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సోమవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. చీడీలపొర, దుమ్ములపేట, ఎస్‌ఎఫ్‌సీఎల్, మహాలక్ష్మినగర్ తదితర ప్రాంతాల్లోని అవుట్‌లెట్లను పరిశీలించారు. వర్షపునీరు నిలిచిపోకుండా అవుట్‌లెట్లను క్లియర్ చేస్తున్న తీరును పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, అధికారులు తీసుకుంటున్న ముందస్తు చర్యలను పరిశీలించారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఇతర అధికారులు ఉన్నారు.


తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

తుపానుతో స్తంభించిన జనజీవనం

- నేలనంటిన వరిచేలు
- కళ్లాల్లోనే ధాన్యం నిల్వలు

కరప: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలకు అనేక గ్రామాల్లోని శివారు, లోతట్టు ప్రాంతాల్లోని వీధులు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. రోడ్లపై, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలల ఆవరణలో నీరు చేరింది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. యండమూరు శివారు వడ్డిపాలెంలో రెండు విద్యుత్ స్తంభాలు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తమ సిబ్బందితో యుద్ధప్రాతిపదిక మరమ్మతులు చేపట్టి, సరఫరాను పునరుద్ధరించారు. మండలంలో కురుస్తున్న వర్షానికి తోడు ఎగువ ప్రాంతాల నుంచి ముంపునీరు వచ్చి చేరుతుండటంతో పంట, మురుగుకాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాల కారణంగా కాకినాడ వెళ్లే జట్టు పనివారు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇటుక బట్టీల్లో తీసిన ఇటుకలు తడిసిపోకుండా బరకాలతో కప్పి ఉంచామని, ఈదురుగాలులకు బరకాలు ఎగిరిపోవడంతో ఇటుకలు దెబ్బతిన్నట్టు యజమానులు తెలిపారు.

మండలంలో 14,091 ఎకరాల్లో సార్వాపంట సాగు చేశారు. ముదరగా ఊడ్చిన పొలాల్లో వరికోతలు పూర్తి కాగా, ఆలస్యంగా నాట్లు వేసిన పొలాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ధాన్యం కళ్లాల్లో, లేఅవుట్లలో రాశులుగా వేసి ఉంచామని, ధాన్యం తడిసిపోతే నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు వరిచేలు నేలనంటాయని, పనపై ఉన్న పంట తడిసి దెబ్బతింటుందని, ధాన్యం రంగుమారవచ్చని వారంటున్నారు. మెషీన్‌తో కోయించిన ప్రాంతాల్లో గడ్డి మళ్లల్లోనే ఉండిపోయిందని, నీరు నిలిచి గడ్డి కుళ్లిపోతే ఎందుకూ పనికిరాకుండా పోతుందని గగ్గోలు పెడుతున్నారు. కుప్పనూర్చిన గడ్డి కూడా తడిసిపోయిందని, ఈ ఏడాది పశుగ్రాసం కూడా దక్కకుండా పోయిందని రైతులు నక్కా వీరభద్రరావు, వెలుగుబంటి సీతారామరాఘవ తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం
ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: మిచాంగ్ తుపాను కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో అవసరమైన అన్ని సహాయక చర్యలు తీసుకుంటున్నామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై కమిషనర్ నాగనరసింహారావు, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను వల్ల ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా, అధికార యంత్రాంగంతో పాటు పార్టీ కేడర్‌ను కూడా సన్నద్ధం చేశామన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడంతో చాలా వరకు ముంపు సమస్యను నివారించగలిగామన్నారు. సాంబమూర్తినగర్, సూర్యనారాయణపురం వంటి ప్రాంతాల్లో ఎంత వర్షం కురిసినప్పటికీ నీరు స్తంభించిన దాఖలాలు లేవన్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బంది ఉంటే వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.

ఆరున క్యాంపస్ ఇంటర్వ్యూలు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిసెంబర్ ఆరున హెటిరో డ్రగ్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు సోమవారం తెలిపారు. 2023లో ఆర్గానిక్ లేదా ఎనలటికల్ కెమిస్ట్రీ డిగ్రీ లేదా పీజీలో పూర్తిచేసి 27 ఏళ్లలోపు అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు 94418 28747 నంబరుకు సంప్రదించవచ్చన్నారు.

విప్రో టాలెంట్ నెక్ట్స్ జావా కోర్సులో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థుల బృందంతో కళాశాల ప్రతినిధులు

బాలాజీచెరువు: ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ విప్రో టాలెంట్ నెక్ట్స్ జావా కోర్సులో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు సోమవారం తెలిపారు. విప్రో సంస్థ నెక్ట్స్ జావా ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహించగా, 28 మంది విద్యార్థులు ప్రతిభ చూపి సర్టిఫికెట్ పొందారని, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగ సాధనకు దోహదపడతాయన్నారు. విద్యార్థుల బృందాన్ని కళాశాల చైర్మన్ శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీవో తేజేశ్వరరావు అభినందించారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండండి

కాకినాడ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు కాకినాడ రూరల్ తహసీల్దార్ మురార్జీ పేర్కొన్నారు. వీఆర్వోలు, అధికారుల బృందంతో సోమవారం వాకలపూడి పంచాయతీ వద్ద సమావేశం నిర్వహించారు. హైస్కూల్‌లో పురవాస కేంద్రం సిద్ధం చేసి, అవసరమైతే మత్స్యకారులను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌పేటలో తుపాను తీవ్రతపై అవగాహన కల్పించారు. మత్స్యకారులెవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. అవసరమైతే పునవాస కేంద్రానికి తరలిస్తామని, సిద్ధంగా ఉండాలని సుమారు 500 కుటుంబాల వారికి తెలియజేశారు. సూర్యారావుపేటలోని మత్స్యకారులనూ అప్రమత్తం చేశారు. తహసీల్దార్ మురార్జీ, ఎంపీడీఓ స్వప్న మాట్లాడుతూ తుపానును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మెడికల్ టీమ్, పునరావాస కేంద్రం, తరలింపు వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వారి వెంట ఎంఈఓ గణేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, వీఆర్వోలు ఉన్నారు.


కాకినాడ రూరల్ వాకలపూడి ఫిషింగ్ హార్బర్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు, వీఆర్వోలు

ధాన్యం కొనుగోలులో నిబంధనల సడలింపు

గ్రామాల్లో జేసీ, జేడీఏ పర్యటన

కరప: తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు నష్టపోకుండా రైతులను ఆదుకోవడానికి ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించినట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లోనే కొనుగోలు చేయాలని, తేమ శాతం చూడకుండా రైతుల నుంచి ధాన్యం సేకరించి, రైసుమిల్లులకు తరలించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచనలతో జేసీ ఇలాక్కియ, జేడీఏ ఎన్.విజయ్‌కుమార్ పెద్దాపురప్పాడు, గొడ్డటిపాలెం, అరట్లకట్ట తదితర గ్రామాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడి తేమ శాతం లెక్కకట్టకుండానే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. ముందు రైతులు అంగీకరించకపోవడంతో, తుపాను వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని, మద్దతు ధరకు కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పడంతో ధాన్యం ఇచ్చేందుకు వారు ముందుకొచ్చారు. ఎంఏఓ ఏవీ రాజేష్ పెద్దాపురప్పాడులో, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ పి.మాచరావులు గొడ్డటిపాలెం, అరట్లకట్టలో ధాన్యం సేకరించి, రైసుమిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశారు.


గొడ్డటిపాలెంలో వర్షంలోనే రైతులతో మాట్లాడుతున్న జేసీ ఇలాక్కియా

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

కరప: కార్తిక మాసం మూడో సోమవారం మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్, రాజు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కరపలో ఈఓ వడ్డాది సత్తిబాబు, చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి, ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ వారు భక్తులకు ఏర్పాట్లు చేశారు. పెనుగుదురు, అరట్లకట్ట, వేములవాడ, పెద్దాపురప్పాడు, వేళంగి, నడకుదురు, గురజనాపల్లి, వాకాడ, కొరిపల్లి, కూరాడ, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పోటెత్తారు.


కరప శివాలయంలో రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కాకినాడ లీగల్: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కాకినాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు న్యాయవాదులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తారన్నారు. ఈ నెల 9 వరకు న్యాయవాదులు విధుల బహిష్కరణకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.రవికృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ

కాకినాడ రూరల్: వినియోగదారులకు సరైన రక్షణ కల్పించేందుకు గ్రామ, మున్సిపల్, కార్పొరేషన్లలోని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను భాగస్వామ్యులను చేసేలా తూనికలు, కొలతల శాఖ చర్యలు చేపట్టింది. కాకినాడ డివిజన్‌లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీ సెక్రటరీలకు తూనికలు, కొల తలపై అవగాహన కల్పిస్తూ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షణ నిర్వహించారు. డీఎల్‌డీఓ పాతంశెట్టి నారాయణమూర్తి అధ్యక్షత వహించారు. తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్ధనరావు, అసిస్టెంట్ కంట్రోలర్ సయ్యద్ సలీమ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వినియోగదారులు తూనికలు, కొలతల్లో నష్టపోకుండా గ్రామీణ ప్రాంతంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అర్బన్‌లో వార్డు ఎమినిటీ సెక్రటరీలు అండగా ఉండొచ్చని వారు పేర్కొన్నారు. తూనికలు, కొలతల్లో తేడాలున్నట్టు గుర్తిస్తే, యాప్ ద్వారా సమాచారమిస్తే.. తాము చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే వారికి రిజిస్ట్రేషన్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా చేపట్టవచ్చన్నారు. కాకినాడ డివిజన్‌లోని కాకినాడ రూరల్, కరప, తాళ్లరేవు, కాజులూరు, పెదపూడి, సామర్లకోట, పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లపల్లి మండలాలతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట మున్సిపాలిటీ, కాకినాడ కార్పొరేషన్లకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్ననారాయణమూర్తి, శ్రీరమణి, జనార్ధనరావు

కలుషితమైతే అనర్థాలే..

- మానవ మనుగడ నేలపైనే ఆధారం
- క్రిమి సంహారకాలతో విపత్తుల్యం
- ప్రకృతి వ్యవసాయమే ప్రత్యామ్నాయం
- నేడు ప్రపంచ నేల దినోత్సవం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): భూమి.. నేల అంటే మినరల్స్, గాలి , నీరు, వృక్ష సంబంధ, జంతు సంబంధ జీవుల సమ్మేళనం. సమస్త జీవులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా నేల నుంచే ఆహారం అందుతోంది. మానవుడి మనుగడ నేలపైనే ఆధారపడి ఉంది. ఇటువంటి నేలను మానవుడు విచక్షణా రహితంగా ఛిద్రం చేస్తున్నాడు. స్వార్థ ప్రయోజనాల కోసం అడవుల నరికివేత వల్ల నేల కోతకు గురై నిస్సారంగా మారుతోంది. ఆయా కారణాలతో భావితరాలకు మంచి నేలను అందించడం ప్రశ్నార్థకంగా మారింది. మంగళవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ఈ కథనం.

విచ్చలవిడిగా దుక్కులు దున్ని..

పూర్వకాలంలో ఎద్దులు, దున్నలతో దుక్కు దున్ని, పంటలు సాగు చేస్తే.. ఎంతో బాగా పండేవి. రానురాను యంత్రాల సాయంతో దుక్కులు, దమ్ములు చేయడం వల్ల నేల భౌతిక రసాయన ధర్మాలు కోల్పోతోంది. నేలలోని సూక్ష్మజీవులు నశించి, దిగుబడి బాగా తగ్గిపోతోంది. భవిష్యత్తులో ఆహార సమస్య కూడా నెలకొనే పరిస్థితి లేకపోలేదు.


శంఖవరం మండలంలో ఆవుపేడతో పంట ఎరువు తయారు చేస్తున్న దృశ్యం

క్రిమి సంహారకాల వినియోగం

పూర్వం సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల క్రిమి సంహారక మందులు వినియోగించేవారు కాదు. అప్పట్లో వేపనూనె, ఆవు పేడతో ఘనామృతం, ద్రవామృతం రూపొందించి, పంటలపై పిచికారీ చేసేవారు. నేలకు ఎలాంటి నష్టం ఉండేది కాదు. ప్రస్తుతం క్రిమి సంహారక, కలుపు మందులు వాడడం వల్ల సూక్ష్మజీవులు, వృక్ష, జంతు సంపద నశించిపోతోంది. ఒకే రకమైన పంట వేయడం వల్ల భూమిలోని సూక్ష్మ జంతు జీవాలకు ఆహారం లేక అవి నశించిపోతాయి.

365 రోజులు పచ్చగా ఉంచాలి



నేలను 365 రోజులూ పచ్చగా ఉంచడం వల్ల గ్లోబల్ వార్మింగ్ తగ్గించి, సూక్ష్మ వాతావరణాన్ని మానవ జాతి మనుగడకు అనుగుణంగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జె.ఎలియేజర్, ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

ఉప్పాడ బీచ్ రోడ్డును పరిశీలించిన కలెక్టర్

కొత్తపల్లి: మిచాంగ్ తుపాను కారణంగా తీరప్రాంతంలో ఉన్న అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. మండలంలోని ఉప్పాడలో కోతకు గురవుతున్న తీరప్రాంతం, మత్స్యకార గృహాలను, ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డును సోమవారం ఆమె పరిశీలించారు. ముందు జాగ్రత్త చర్యలపై స్థానిక అధికారులను ఆదేశించారు. సూరాడపేట ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికి భోజనం వడ్డించారు. వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు తుపాను ప్రభావం ఉండవచ్చన్నారు. దీని కారణంగా జిల్లాలోని తీరప్రాంత గ్రామాల్లో అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్టు చెప్పారు. తీరానికి సమీపంలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. వారికి కావాల్సిన భోజనం, తాగునీరు, అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. చిన్నారులకు పాలు, గుడ్లు అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. తుపాను నష్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.